క్లుప్తంగా

నివాళి



నివాళులర్పిస్తున్న కళత్తూరు నారాయణ స్వామి, నాయకులు

గంగాధర నెల్లూరు: మండలంలోని బుక్కాపట్నం దళితవాడకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గణేష్ (52) మంగళవారం సాయంత్రం హఠాన్మరణం చెందాడు. ఇది తెలుసుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి బుధవారం నాయకులతో కలిసి గణేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుక్కాపట్నం సర్పంచ్, సీనియర్ నాయకులు మునిరాజారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, లోకేష్ రెడ్డి, వేల్కూరు కుట్టి, ఢిల్లీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నగరి: నగరి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేయనున్న బార్ అండ్ రెస్టారెంట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికిగాను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, చిత్తూరు స్వీకరిస్తారన్నారు. దరఖాస్తుదారుడు నాన్ రీ–ఫండబుల్ అప్లికేషన్ ఫీజు రూ.5 లక్షలు, ప్రాసెస్ ఫీజు రూ.10 వేలు చెల్లించాలన్నారు. లైసెన్స్ పొందేవారు మొదటి సంవత్సరం లైసెన్స్ ఫీజు రూ.55 లక్షలు చెల్లించాలన్నారు. ఏవైనా సందేహాలుంటే తమ కార్యాలయం లోగానీ లేదా 9440902548 నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ



నిండ్ర: హెల్మెట్ ధారణపై బుధవారం మండల కేంద్రంలో పోలీసులు మోటార్ సైకిళ్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరి రూరల్ సీఐ భాస్కర్ మాట్లాడుతూ, హెల్మెట్ ధరించి నడిపితే ప్రమాదాల్లో ప్రాణరక్షణకు ఉపయుక్తమవుతుందన్నారు. వాడకపోతే కలిగే అనర్థాలను తెలియజేశారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఐ మహేష్, పోలీసులు పాల్గొన్నారు.


ట్యాంకర్ ఢీకొని టెంపో బోల్తా



బంగారుపాళెం: మండలంలోని మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి టెంపోను ఓ ట్యాంకర్ వాహనం ఢీకొంది. కోలార్ నుంచి తిరుపతికి కూరగాయల లోడుతో వెళ్తున్న టెంపోను మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద పలమనేరు నుంచి చిత్తూరుకు వెళ్తున్న ట్యాంకర్ వెనుక నుంచి వేగంగా ఢీకొనడంతో టెంపో బోల్తాపడింది. డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జాతీయ రహదారిపై ఈ ఘటనతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బోల్తా పడిన టెంపోను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పీఎం సూర్య ఘర్‌తో విద్యుత్ వెలుగులు

- విద్యుత్ బిల్లుల ఆదాకు మార్గం
- ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు
- సబ్సిడీ ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం



పుత్తూరు: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిపోయింది. దీంతో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. ఈ విద్యుత్ చార్జీలు పేద, మధ్య తరగతి ప్రజలకు భారమవుతున్నాయి. వినియోగం ఇలాగే పెరుగుతూ పోతే భవిష్యత్తులో విద్యుత్ కొరత తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా పీఎం సూర్యఘర్ పేరిట సోలార్ విద్యుత్‌ను ప్రజల ముందుకు తీసుకొచ్చింది. ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థ ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఇంటి పైకప్పు మీద సోలార్ పలకల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. ముఖ్యంగా ఏసీలు, గీజర్లు వాడే వినియోగదారులకు ఈ సోలార్ పవర్ ఎంతో ఉపయోగకరం. ఈ పథకానికి బ్యాంకులు రుణాలను సైతం ఇస్తున్నాయి. ట్రాన్స్‌కో అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సోలార్ ఏర్పాటుకు సుముఖంగా ఉన్నవారి పేర్లు నమోదు చేస్తున్నారు. విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలకు పీఎం సూర్య ఘర్ ఓ చక్కటి అవకాశం.

సబ్సిడీ కొన్ని రోజులు మాత్రమే



సబ్సిడీ నిరంతరం ఇచ్చే ప్రక్రియ కాదు. కొన్ని రోజులు మాత్రమే ఉంటుంది. ఎవరు ముందుగా తీసు కొంటారో వారికే ఈ లబ్ధి చేకూరుతుంది. కేంద్రం నిర్దేశిత లక్ష్యం చేరుకుంటే సబ్సిడీ ఎప్పుడైనా ఆగిపోవచ్చు. పైగా సోలార్ ఒకసారి ఏర్పాటు చేసుకుంటే నిర్వహణ ఖర్చు ఏమీ ఉండదు. 25 ఏళ్ల పాటు నిరంతం సేవలందుకోవచ్చు. పుత్తూరు డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 57 మంది సోలార్ సేవలందుకుంటున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి.

–ఎస్.ఆశీర్వాదం, ఈఈ, ఏపీఎస్పీడీసీఎల్, పుత్తూరు డివిజన్

సోలార్ విద్యుత్‌తో ప్రయోజనాలు

- విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది.
- ఇంటి పైకప్పు చల్లగా ఉంటుంది.
- వాడకానికి మించి ఉత్పత్తి చేస్తే మిగులు విద్యుత్ విక్రయంతో ఆదాయం పొందవచ్చు.
- మిగులు విద్యుత్‌ను డిస్కంలకు విక్రయంతో పెట్టుబడి సొమ్మును ఐదేళ్లలో పొందవచ్చు.
- ఈ పథకం కేవలం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది.
- పర్యావరణాన్ని కాపాడడంలో భాగస్వాములు కావచ్చు.
- ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు 10 చదరపు మీటర్ల స్థలం అవసరం ఉంటుంది.



ఇంటిపై ఏర్పాటు చేసిన సౌర ఫలకాలు

సోలార్ ఏర్పాటుకు అయ్యే ఖర్చు – సబ్సిడీ వివరాలు

సామర్థ్యం	ఖర్చు	సబ్సిడీ	నెలకు ఉత్పత్తి యూనిట్లు
1కిలోవాట్	రూ.75వేలు	రూ.30వేలు	100
2కిలోవాట్	రూ.1.40లక్షలు	రూ.60వేలు	220
3కిలోవాట్	రూ.2.17లక్షలు	రూ.78వేలు	340
4కిలోవాట్	రూ.2.67లక్షలు	రూ.78వేలు	460

13న జాతీయ లోక్ అదాలత్



జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: సబ్ కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్సీ.రాఘవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సివిల్ కేసులు, వివాహ సంబంధ మనోవర్తి, చెక్ బౌన్స్ కేసులు, రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. అలాగే ప్రీ లిటిగేషన్ కేసులు (కోర్టులో పెండింగ్‌లో లేని కేసులు)సైతం రాజీ చేస్తామన్నారు. లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు అంతిమ తీర్పు అని, దీనిపై అప్పీల్ వెళ్లడానికి అవకాశమే లేదని స్పష్టం చేశారు. న్యాయవాదులు, పోలీసులు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం: మాధవరం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో మూడవ విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భైరవుడు బుధవారం తెలిపారు. ఐటీఐలోని వివిధ ట్రేడ్లలో మిగిలిన సీట్లకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదవ తరగతి పాసైన అభ్యర్థులు, ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 29న ఐటీఐ కాలేజీలో ఇంటర్వ్యూలకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

కూటమి ప్రభుత్వ అరాచకాలను ఎండగడదాం

- జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి



భూమనను సన్మానిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, సమన్వయకర్త కృపాలక్ష్మి

కార్వేటినగరం: ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని చిత్తూరు ఉమ్మడి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మార్గదర్శనం చేశారు. బుధవారం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి భూమనను తిరుపతిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో ఆయన ప్రజా సమస్యలపై చేయాల్సిన పోరాటం, ఆందోళన కార్యక్రమాల గురించి చర్చించారు. సమన్వయకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ కూటమి ప్రభుత్వం అరాచకాలను ఎండగట్టి అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలకు ఎక్కడ అన్యాయం జరిగినా వారికి అండగా నిలిచి పోరాటం చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నారాయణస్వామి మాట్లాడుతూ, తమ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ అన్ని రకాల పింఛన్లు ఇస్తే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం సదరన్ సర్టిఫికెట్ల పేరిట ఉన్న పింఛన్లను తొలగిస్తూ, వికలాంగుల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు.

వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



సీఐ హనుమంతప్ప

కార్వేటినగరం: వీధుల్లో వినాయ ప్రతిమలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా పొందాలని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప స్పష్టం చేశారు. ఈ నెల 27న వినాయక చవితి నేపథ్యంలో బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సీఐ మాట్లాడారు. వినాయక మండపాల వద్ద డీజే మ్యూజిక్ ఏర్పాటు చేయరాదన్నారు. ప్రతిమల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని, పోలీస్ శాఖ అనుమతి లేకుండా ప్రతిమలు ఏర్పాటు చేసినా, డీజే మ్యూజిక్‌తో న్యూసెన్స్ కలిగించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో చవితిని సంతోషంగా జరుపుకోవాలని చెప్పారు.

శబరిమలలో పెద్దిరెడ్డిని కలిసిన తులసి యాదవ్



శబరిమలైలో ఇరుముడితో వెళ్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తులసి యాదవ్

పాలసముద్రం: అయ్యప్పస్వామి మాల ధరించిన మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ తులసి యాదవ్ బుధవారం మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శబరిమలై యాత్రలో కలిశారు. అక్రమ కేసులో జైల్లో ఉన్న మిథున్ రెడ్డి త్వరగా బయటకు రావాలని వేలాంగనిలో మోకాలిపై నడిచి వెళ్లి ప్రార్థించామని, ఇప్పుడు మొక్కు చెల్లించేందుకు వచ్చినట్టు తులసి యాదవ్..పెద్దిరెడ్డికి చెప్పారు. శబరిమలైలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఆనందన్ ఉన్నారు.

ప్రతి పోలింగ్ బూత్‌కు ఏజెంట్

–డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ



మాట్లాడుతున్న స్పెషల్ డెప్యూటీ కలెక్టర్

గంగాధరనెల్లూరు: గుర్తింపు పొందిన ప్రతి రాజకీయ పార్టీ తరఫున ప్రతి పోలింగ్ బూత్‌కు ఏజెంట్‌ను నియమించే పేర్ల వివరాలను అధికారులకు ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన పైవిధంగా మాట్లాడారు. ఏజెంట్ల పూర్తి వివరాలను ప్రస్తుతం నిర్దేశించిన సమయం లోపు త్వరితగతిన నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులకు, రెవెన్యూ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ బూత్‌ల నిర్వహణలో సలహాలు–సూచనలు ఇవ్వాలని, మార్పులు–చేర్పుల్లో భాగంగా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు, లోకనాథం పిళ్లై, బాబు, ఎన్నికల డీటీ మహేశ్వరి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



వెదురుకుప్పం: ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

వెదురుకుప్పం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పచ్చికాపల్లం పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణ చైతన్య కోరారు. బుధవారం మండలంలోని ఆర్‌కేఎం పురంలో దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమ కాటు వలన డెంగీ, ఫైలేరియా, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దోమల నిర్మూలనకు చొరవ చూపాలన్నారు. నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. అనంతరం అంటు వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి చెంగారెడ్డి, సీహెచ్ఓ మధుసూదన్, సూపర్‌వైజర్ ఈశ్వరి, మురళీమోహన్, క్రిష్టారెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు



సిమెంటు రోడ్డు పనులు చేస్తున్న కూలీలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం సమీపంలో ఉన్న జగనన్న కాలనీకి జిల్లా పరిషత్ నిధులతో సిమెంటు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. పచ్చికాపల్లం–పెనుమూరు ప్రధాన రహదారి నుంచి కాలనీ వరకు సుమారు 200 మీటర్లు మట్టి రోడ్డు ఉండడంతో వర్షాలకు అధ్వానంగా మారింది. దీంతో సమస్యను స్థానికులు జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన జెడ్పీ చైర్మన్‌తో మాట్లాడడంతో ఆయన సీసీ రోడ్డు నిర్మాణానికి జెడ్పీ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్, కాంట్రాక్టర్ అత్తూరు సురేష్‌రెడ్డి సీసీ రోడ్డును పనులను చేపట్టారు. జెడ్పీటీసీతో పాటు అధికారులు ఈ పనులను బుధవారం పరిశీలించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్, పార్టీ నాయకులు మురళి, విజయభాస్కర్, నటరాజ్ పాల్గొన్నారు.

‘ఉపాధి’లో ఫొటో ఆధారిత హాజరు



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్

నిండ్ర: జాతీయ ఉపాధి హామీ పథకంలో ఇకపై ఫొటో ఆధారిత హాజరును అమలు చేయనున్నట్టు నగరి క్లస్టర్ ఏపీడీ సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో వేతనదారులకు పారదర్శక హాజరు నమోదు, ప్రతిపాదనలు సిద్ధం చేయవచ్చన్నారు. ఉపాధి అధికారులు, సిబ్బంది సంపూర్ణ శిక్షణతో ఈ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ జయచంద్ర సాంకేతిక సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఓలు, జేఈలు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

నగరి: ఉద్యోగావకాశాల కోసం అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులందరికీ ఒకరోజు ఉద్యోగ సిద్ధత శిబిరం నిర్వహించారు. 1ఎం, 1బి గ్రీస్ స్కిల్స్ అకాడమి సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగావకాశాలు పొందాలంటే నైపుణ్యాలను పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు. ప్రధాన సాంకేతిక సెషన్లలో ప్రోగ్రాం ట్రైనర్ యోగేశ్వర్ రెజ్యూమ్ బిల్డింగ్, ఫ్రీ టూల్స్, డిజిటల్ సిటిజన్‌షిప్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ జాబ్ మార్కెట్, ఇంటర్వ్యూ స్కిల్స్, ఇండస్ట్రీ సర్టిఫికేషన్, లింక్డ్ ఇన్ ప్రొఫైల్ డెవలప్‌మెంట్..ఇత్యాది అంశాలను వివరించారు. అలాగే విద్యార్థులను 1బిఎం డేటా ఎనలిస్ట్ ఉచిత కోర్సుకు నమోదు చేసి, దానిని పూర్తి చేయడానికి వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.పంకజ, కెరీర్ గైడెన్స్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.రేవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు సమగ్రంగా ఉండాలి

తవణంపల్లె: గుజ్జు ఫ్యాక్టరీలకు మామిడి కాయలు తోలిన రైతుల వివరాలను సమగ్రంగా ఆన్‌లైన్ చేసి నివేదిక పంపాలని వ్యవసాయాధికారి ప్రవీణ్ కోరారు. బుధవారం పల్లెచెరువు, దిగువమాఘం రైతు సేవా కేంద్రాల్లో గుజ్జు ఫ్యాక్టరీలకు మామిడి కాయలు తోలిన రైతుల జాబితా పరిశీలనకు గ్రామ సభ నిర్వహించారు. మామిడికాయలు తోలిన వారి జాబితాను రైతులకు వెల్లడించారు.

పీజీఆర్ఎస్ సమస్యలు పరిష్కరించాలి



కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ

వెదురుకుప్పం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమాచార హక్కు చట్టం కింద సమాచారాన్ని నిర్ణీత గడువు లోపు ఇవ్వాలన్నారు. అలాగే ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా చేస్తూ పారిశుధ్యం మెరుగుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పురుషోత్తం, ఏఓ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

నాగలాపురం: మండలంలోని భారత్ గ్యాస్ సమీపంలో పుత్తూరు–చెన్నై హైవేపై బుధవారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పిచ్చాటూరు మండలం అప్పంబేడుకు చెందిన బాలమురుగన్ బైకుపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తలకు తీవ్రగాయమైన అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

భక్తిప్రపత్తులతో పవిత్రోత్సవాలు





విశేష అలంకరణలో ఉత్సవమూర్తులు, పురవీధుల్లో విహరిస్తున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు

కార్వేటినగరం: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వేకుజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపారు. శుద్ధి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు, ఆలయంలో ప్రత్యేక హోమాల అనంతరం లను టీటీడీ వేదపండితుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట మధ్య పవిత్ర సమర్పణ భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఇందులో భాగంగా అగ్నిహోమం ప్రతిష్ట, నవకలశ స్థాపన, పవిత్ర ప్రతిష్ఠ హోమం..ఇత్యాది వాటిని శాస్త్రోక్తంగా చేశారు. అలాగే ఉత్సవమూర్తులను పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పురవీధుల్లో వేణుగోపాలుడి విహారం

వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా ఉభయనాంచారులతో పాటు వేణుగోపాలుడుని ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చారు. నగర వీధుల్లో చెక్కభజనలు, కోలాటాలు, మేళతాళాల నడుమ ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం 6 నుంచి 8 గంటల వరకు ఆలయంలో యాగశాల, వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. 8.30 గంటలకు ఆచార్య బహుమానాన్ని బహూకరించారు. 9.45 గంటలకు స్వామివారు ఏకాంత సేవలో పవళించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, టీటీడీ వేదపండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం



వడమాలపేట (విజయపురం): తడుకు–అప్పలాయిగుంట రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉంది. నిత్యం వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షపు నీళ్లు నిలిచి ఉండడంతో మోటార్ సైకిలిస్టులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే చాలామంది వాహదారులు కింద పడి గాయపడ్డారని, గుంతలకు మరమ్మతులు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలి



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన కూరగాయలు, మునగను పరిశీలిస్తున్న శ్రీదేవి

పాలసముద్రం: పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి ఆకాంక్షించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం డీపీఎం సునితాలక్ష్మి, ఏకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ, డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వెలుగు సిబ్బంది కృషి చేయాలన్నారు. పొదుపుపై అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకు లింకేజీతో పొందుతున్న రుణాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలి? ఎలా చెల్లించాలి? అనే విషయాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు మునగ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయల సాగుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన మునగ, కూరగాయల పంటలను ఆమె క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి. సంఘమిత్రలు మురగయ్య. శోభ, మంజుల, మహిళలు పాల్గొన్నారు.